# తెలంగాణ వారధి

సమగ్ర తెలుగు దినపత్రిక

30.11.2025
ఆదివారం, హైదరాబాద్
సంపుటి: 01 సంచిక: 43
www.telanganavaradhi.com
ఎడిటర్: గంగారపు విజయ్,
బ్యూరో చీఫ్: పొలాస దిలీప్
Follow: /telanganavaradhi




## భట్టి విక్రమార్కను కలిసిన లకావత్ ధనవంతి

**తెలంగాణ వారధి,హైద్రాబాద్:** జనగామ డిసిసి అధ్యక్షురాలుగా నియమిత లకావత్ ధనవంతి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, ఉమ్మడి వరంగల్ మాజీ జెడ్పీ చైర్మన్ లకావత్ లక్ష్మీ నారాయణ

మిగతా 4లో..



# బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తెలంగాణ వారధి, వరంగల్ టౌన్:

పూజల అనంతరం వెయ్యి స్తంభాల గుడికి చేరుకొని అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం రుద్రేశ్వరస్వామికి పూజలు చేశారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి హరిత ప్లాజాలో సమీక్ష నిర్వహించారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) పరిధిలోని వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెయ్యి స్తంభాల గుడి ఆవరణలో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని అధికారులను కిషన్ రెడ్డి ఆదేశించారు. పాత మట్టి కోటపై తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. భద్రకాళి ఆలయ పరిధిలో టూరిజం డెవలప్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు భూ సేకరణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణ పూర్తికాగానే ప్రధాని మోదీతో భూమిపూజ చేయిద్దామని అధికారులకు తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కుకు సంబంధించి భూమి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాజీపేటలోని రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సంభంధిత అధికారులతో కలిసి సందర్శించారు. పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



**ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ శ్రేణులు శనివారం ఘన స్వాగతం పలికారు. వందేభారత్ రైలులో వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న మంత్రి కిషన్ రెడ్డి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్ క్యాంటీన్‌లో 'ఛాయ్ పే' చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కేంద్ర మంత్రికి పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు.**

# నగరంలో ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్

- గ్రేటర్‌లో ఇలాంటివి మరిన్ని నిర్మిస్తాం
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



తెలంగాణ వారధి, హైదరాబాద్:

నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు శనివారం కేబీఆర్ పార్కు వద్ద జీహెచ్ఎంసీ, నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంయుక్త అధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కారు పార్కింగ్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అధికారిక వాహనంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి కూర్చుని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్‌లో పార్క్ చేసే విధానం, పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం మేయర్ విజలక్ష్మీ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే గ్రోయింగ్, హ్యాపెనింగ్ సిటీ హైదరాబాద్‌లోని అత్యంత రద్దీగా ఉన్న కేబీఆర్ పార్కు వద్ద అటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ అమోదం తెలిపిన 6 నెలల స్వల్ప కాలంలోనే నవ నిర్మాణ్ అసోసియేట్స్ అధునాతన మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రద్దీ గల ప్రదేశాలలో ఇలాంటివి మరిన్ని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్‌లను పబ్లిక్ ప్రైవేట్



పార్టనర్ షిప్ విధానంలో నిర్మిస్తామని చెప్పారు. తక్కువ స్థలంలో ఎక్కువ కారులు నిలిపేలా నిర్మించే మల్టీ లెవెల్ స్మార్ట్ కార్ పార్కింగ్‌తో నగరంలో వాహన దారులకు, పాదచారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పార్కింగ్ కష్టాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలో పార్కింగ్ కష్టాలను దూరం చేసే దిశగా మరిన్ని అటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్‌లు రావల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేంకటేష్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి తదితర అధికార పార్టీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



## అసాంఘిక శక్తులకు సజ్జనార్ వార్నింగ్

# అసాంఘిక శక్తులకు సజ్జనార్ వార్నింగ్

- 86 మంది బైండోవర్
- అదనపు మేజిస్ట్రేట్ హోదాలో కేసులను విచారించిన హైదరాబాద్ సీపీ
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరిక



తెలంగాణ వారధి, హైదరాబాద్:

హైదరాబాద్‌లో అసాంఘిక శక్తులపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ కఠిన చర్యలు తీసుకున్నారు. నగరంలో హత్యలు, హత్యాయత్నాలు, ప్రత్యర్థి ముఠాలపై దాడులకు తెగబడుతున్న 10 ప్రధాన ముఠాలకు చెందిన 86 మందిని బైండొవర్ చేశారు. శనివారం వీరిని బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీకి పిలిపించి.. అదనపు జిల్లా మెజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) హోదాలో ప్రత్యేక కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ పరిధిల్లో ఆధిపత్య పోరు కోసం ఘర్షణ పడుతున్న వారిని సజ్జనార్ విచారించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 126 కింద 86 మందిని కమిషనర్ బైండోవర్ చేశారు. రాబోయే ఏడాది కాలం పాటు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమని, సత్ప్రవర్తనతో ఉంటామని వారి చేత సెక్యూరిటీ బాండ్లు రాయించుకున్నారు. బాండ్ రాసిచ్చిన కాలపరిమితిలోపు ఎవరైనా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాండ్‌ను రద్దు చేయడంతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విచారణలో స్పెషల్ బ్రాంచ్ డీసీపీ కె.అపూర్వారావు, సంబంధిత ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



# సైన్స్ ఫెయిర్‌లో వినూత్న ప్రాజెక్టులు

- జూనియర్–సీనియర్ విభాగాల్లో బహుమతులు
- ఇన్స్పైర్ విభాగంలో 8 రాష్ట్రస్థాయి ఎంపికలు

తెలంగాణ వారధి, జనగామ:

స్థానిక సాన్ మారియా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్ - సైన్స్ ఫెయిర్, డిఎల్పీసీ, డీఎల్బీవీపీ శాస్త్రీయ కార్యకలాపాల ముగింపు సమావేశం ఈరోజు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జిల్లా పాలనాధికారి & జిల్లా విద్యా శాఖాధికారి పింకిష్ కుమార్ ఐఏఎస్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, తరగతి గదుల్లో నేర్చుకున్న విజ్ఞానాన్ని జీవితంలో పరిశీలనాత్మక దృష్టితో అన్వయించుకోవాలని సూచించారు. శాస్త్రాన్ని కేవలం పాఠ్యాంశంగా కాక, ప్రపంచాన్ని అర్థం చేసుకునే మార్గంగా స్వీకరించాలన్నారు. ఈసారి విజేతలుగా నిలవని విద్యార్థులు కూడా వచ్చే సంవత్సరం మరింత శ్రమించి వినూత్న ప్రాజెక్టులతో పాల్గొని విజేతలుగా నిలవాలని ప్రోత్సహించారు. కార్యక్రమ నిర్వహణలో శ్రమించిన కార్యాలయ సిబ్బంది, ఆతిథ్యం అందించిన సాన్ మారియా పాఠశాల యాజమాన్యం, బోధకులు అందరినీ ఆయన అభినందించారు. ముగింపు సమావేశంలో మొత్తం 40 మంది విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా సర్టిఫికేట్లు, శీల్డులు అందజేయబడాయి. ఈ కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్ 7 సబ్‌థీమ్స్‌లో జూనియర్, సీనియర్ విభాగాలలో మొదటి, రెండో బహుమతులు ఇన్స్పైర్ విభాగంలో 8 రాష్ట్రస్థాయి ఎంపికలు సెమినార్ విభాగంలో మొదటి, రెండో బహుమతులు TLM తయారీ లో మొదటి, రెండో బహుమతులు ప్రకటించారు. తదేకంగా పాల్గొన్న విద్యార్థులందరికీ, గైడ్ టీచర్లందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసారు.

# భాజపాలో చేరిన మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు





తెలంగాణ వారధి, పాలకుర్తి:

కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రాజకీయ మార్పు చేయడానికి తెలంగాణ రాష్ట్రంలో మరికొన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు భారతీయ జనతా పార్టీ (భాజపా)లో చేరారు.ఈరవెన్ను గ్రామ మాజీ సర్పంచ్ ముస్కు నిర్మల, చంద్రబాబు తో పాటు శతాపురం దుబ్బ తండాకు చెందిన గుగులోతు రవీందర్ మరికొంత మంది ప్రముఖ కాంగ్రెస్ నాయకులు భాజపా జాతీయ, జిల్లా, మండల పార్టీ నాయకుల సమక్షంలో పార్టీలో చేరడం జరిగింది.ఈ .చౌడ రమేష్ మాట్లాడుతూ, మరికొన్ని గ్రామాల నుంచి కూడా నేతలు భాజపాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలు పేదరిక పాలన, ఆర్థిక అభివృద్ధి కోసం అంతరాయం లేకుండా పనిచేస్తున్నాయని ప్రజలు గ్రహించారని, ప్రతి గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు భాజపా అభ్యర్థులు పోటీ చేసి గెలిచేందుకు విస్తృతంగా ప్రయత్నించాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ పార్టీలో చేరడం ద్వారా పేద ప్రజల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి భాజపా మరింత శక్తివంతంగా కృషి చేయనుందంటూ పార్టీ నాయకులు అన్నారు ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు చౌడ రమేష్, మండల అధ్యక్షులు మారం రవికుమార్, జిల్లా నేత దొంగరి మహేందర్, రాష్ట్ర నాయకులు దశమంత్ రెడ్డి, కేవీఎల్ మా. రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, కాసోజు సమ్మయ్య చారి, మాజీ ఎంపీటీసీలు కొడిశాల యాదగిరి, అనుముల ఎల్లయ్య, సుధాకర్, ఉప్పలయ్య, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా సైన్స్ ఫెయిర్‌లో కార్మెల్ విద్యార్థులు

- సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ,ద్వితీయ బహుమతులు

జనగామ జిల్లా:

పాలకుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు జనగామలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకున్నారు. ఈ పోటీలలో పాల్గొన్న, ఏ కీర్తి ఎనిమిదవ తరగతి, వి హర్షిత ఎనిమిదవ తరగతి, ప్రథమ బహుమతి, కే శరణ్య తొమ్మిదవ తరగతి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అదనపు కలెక్టర్ పింకేష్ గోయల్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎలిజిబెత్, ఈ కార్యక్రమంలో ఇన్చార్జి టీచర్ వంశీ, రజిత, హరి , బావని పాల్గొన్నారు.

# ఘనంగా దీక్షా దివస్



- హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి

తెలంగాణ వారధి, పర్వతగిరి:

పర్వతగిరి మండలంలో ఘనంగా దీక్షా దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దీక్షా దివస్ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన చారిత్రక రోజు అని, గల్లీ గల్లీని కదిలించి ఢిల్లీని ఉరికించిన దీక్ష అని అన్నారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో.. అంటూ 2009, నవంబర్ 29న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమనేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు అని అన్నారు. తెలంగాణ గతిని మార్చిన దీక్ష దివాస్ నేటితో 16 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్ర పోరాటానికి సగర్వంగా జై కొడుతూ.. కేసీఆర్ అద్భుత పోరాట స్ఫూర్తిని స్మరించుకుందాం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జై తెలంగాణ. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.








# పల్లె పోరు.. ఝాన్సమ్మ జోరు





- పంచాయతీ సంగ్రామంలో అత్తాకోడళ్ల హవా
- ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే దెబ్బకు ఎర్రబెల్లి విలవిల
- కాంగ్రెస్ లోకి బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు

**తెలంగాణ వారధి, పాలకుర్తి:** పంచాయతీ ఎన్నికలవేళ పాలకుర్తి నియోజకవర్గంలో సమీకరణలు వేగంగా మారుతున్నాయి. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రాజకీయ ఎత్తులకు బీఆర్ఎస్ పార్టీ చిత్తవుతోంది. అత్తాకోడళ్ల దెబ్బకు మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఆయన అనుచరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలవేళ బీఆర్ఎస్ నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ లోకి బాట పట్టడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో దుమ్మురేపిన అత్తా కోడళ్లను పంచాయతీ ఎన్నికల్లో ఎదుర్కోలేక తోక ముడుస్తున్నారు. తాజాగా నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లోకి చేరుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఉత్సాహం.. బీఆర్ఎస్ నేతల్లో నైరాష్యం నెలకొంది.

**వెలికట్టెలో బీఆర్ఎస్ ఖాళీ**

స్థానిక ఎన్నికల వేళ తొర్రూరు మండలంలోని వెలికట్టె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి బందు రవి, మాజీ ప్రధాన కార్యదర్శి యాకయ్య, సీనియర్ నాయకులు బందు రాములు, బందు శ్రీను, సంపత్, జోగయ్య, మహేష్, సాగర్, తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి సమక్షంలో వారంతా కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో బోగా కమలాకర్, దేశగాని భిక్షపతి, బందు వెంకన్న, కొమ్ము శ్రీను స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**గోపాలగిరిలో బీఆర్ఎస్, బీజేపీకి భారీ దెబ్బ**

తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారపు యాకయ్య, బీజేపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారపు వెంకన్న, మాజీ వార్డు సభ్యులు ధర్మారపు మహేష్, ధర్మారపు నరేష్, ఎస్కే యాకుబ్ పాషా, మహిళా నాయకులు ధర్మారపు విజయ, అనూష ఆ పార్టీలకు రాజీనామా చేసి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**హచ్చు తండాలో బీఆర్ఎస్కు ఎదురుదెబ్బ**

తొర్రూరు మండలం హచ్చు తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ బానోత్ భిక్షపతి ఆ పార్టీకి రాజీనామా చేసి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**అన్ని హామీలను నెరవేరుస్తాం**

చేరికల సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పార్టీ శ్రేణులు, కొత్తగా చేరిన నాయకులు చురుకుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేరువగా సేవలందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు నమ్మకం ఉందని, అందుకు జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితమే నిదర్శనం అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చాప్టర్ క్లోజ్ అయిందని, ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా పాలకుర్తి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తామిచ్చిన అన్ని హామీలను గడువులోగా నెరవేరుస్తామన్నారు. తాము మాట తప్పే వాళ్ళం కాదని ఝాన్సీరెడ్డి, యశస్విని రెడ్డి స్పష్టం చేశారు.





ఎమ్మెల్యే సమక్షంలో

## భారీగా చేరికలు

దేవరుప్పల మండలం లక్ష్మణ్ తండా కు చెందిన పదుల సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణ





- మండల పరిషత్ అధికారి వేదవతి సూచనలు
- 52,845 ఓటర్ల కోసం మూడవ విడత ఎన్నికలు
- 38 పోలింగ్ కేంద్రాలు, 336 స్టేషన్లు ఏర్పాటు
- ఎంపీఓ, సూపరింటెండెంట్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు

తెలంగాణ వారధి, పాలకుర్తి:

రాబోయే రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పాలకుర్తి మండలంలో ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులు తమ విధులను శ్రద్ధగా, క్రమశిక్షణతో నిర్వహించాలని మండల పరిషత్ పరిపాలన అధికారి వేదవతి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఎన్నికల ప్రక్రియలో ఏ ఒక్క చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రతీ అధికారి తన బాధ్యతను సమగ్రంగా అర్థం చేసుకుని నిబంధనలకు లోబడి పని చేయాలని . ఎన్నికలు పూర్తిగా సజావుగా, పారదర్శకంగా జరగడం మనందరి కర్తవ్యము" అని తెలిపారు. పాలకుర్తి మండలంలో మొత్తం 52,845 మంది ఓటర్లు ఈ సాధారణ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలో 38 పోలింగ్ కేంద్రాల్లో 336 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మూడవ విడతలో మండలానికి సంబంధించిన పోలింగ్ నిర్వహణ జరుగనున్నట్లు తెలియజేశారు. శిక్షణా కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ రవీందర్, మాస్టర్ ట్రైనర్లు,ఎస్. శేషగిరి రావు క్రాంతి కుమార్,రమేష్,వెంకట్ నర్సయ్య ఏకంబరం,సూర్యప్రకాష్,మూర్తి శ్రీనివాస్ ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అంతటా ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ డే నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ఫార్ములు నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన ఇచ్చారు.

## ఇరవెన్నులో సిపిఎం సర్పంచ్ అభ్యర్థిగా తాటికాయల జానీ



**తెలంగాణ వారధి, పాలకుర్తి:** పాలకుర్తి మండలం ఇరవెన్ను గ్రామంలో సిపిఎం పార్టీ శాఖ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కొంతం సాయిలు అధ్యక్షత వహించగా, సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నేతలు గ్రామస్థితిగతులను సమీక్షించగా, సర్పంచ్ పదవికి సిపిఎం తరపున తాటికాయల జానీని ఏకగ్రీవంగా అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఇరవెన్ను గ్రామంలో మొట్టమొదటిసారిగా సిపిఎం పార్టీ సర్పంచ్ అభ్యర్థిని పోటీ రంగంలోకి దింపుతున్నందున పార్టీ కార్యకర్తలు అందరూ ఐక్యతతో పని చేసి, జానీ విజయం సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ గ్రామ కార్యదర్శి ఎదునూరి మదార్, మాసంపల్లి నాగయ్య, మహమ్మద్ అఖిల్ పాష, తాటికాయల అనిల్, దేవా, కొంతం మహేందర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## 'వికాస్' లో వెజిటేబుల్ కార్వింగ్ డే వేడుకలు



**తెలంగాణ వారధి, తొర్రూరు:** పట్టణంలోని వికాస్ పాఠశాలలో శనివారం వెజిటేబుల్ కార్వింగ్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.విద్యార్థులు అనేక రకాల కూరగాయలను మొసలి, వినాయకుడు,పుట్టగొడుగులు,ఎడ్ల బండి, విమానం, పూల మొక్కలు ఎలుక, కుందేలు, ఫ్లవర్ బాస్కెట్ వివిధ రకాల పుష్పాలు వంటి అనేక ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు.ప్రదర్శించిన కూరగాయల యొక్క ప్రాముఖ్యత,వాటిలో ఉండే విటమిన్స్, మినరల్స్ ని చక్కగా వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులలో ఆరోగ్యకరమైన అంశాల పట్ల అవగాహన కల్పించడం, సృజనాత్మకతను వెలికి తీయడానికి మా పాఠశాలలో నిరంతర కార్యక్రమాలు నిర్వహించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కేవీ రెడ్డి,శ్రీలత, ప్రిన్సిపాల్ వేణుమాధవ్, నాగరాజు,వైస్ ప్రిన్సిపల్ రాజు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈఓ కార్యాలయం ముట్టడికి బీసీ సంఘాల పిలుపు



**తెలంగాణ వారధి,జనగామ:** కొమురవెల్లి మల్లన్న దేవస్థానంలో బీసీ కులాలపై జరుగుతున్న అన్యాయాన్ని తప్పుపడుతూ ఈ నెల 30న దేవస్థానం ఈఓ కార్యాలయం ముట్టడి చేయనున్నట్లు బీసీ సంఘాలు ప్రకటించాయి. ఆలయ కమిటీ చైర్మన్ పదవి గొల్ల-బీసీ లకు ఇవ్వాల్సిన చోట, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడం ఎండోమెంట్స్ శాఖ అధికారుల దుర్వినియోగానికి నిదర్శనమని నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో గొల్ల, కురుమ సంఘాలు సహా బీసీ, సబ్బండ ఉపకులాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ముట్టడిని విజయవంతం చేయాలని జనగామ బీసీ జేఏసీ చైర్మన్ సెవెల్లి సంపత్ పిలుపునిచ్చారు.

## ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి

**తెలంగాణ వారధి, తొర్రూరు:** పదిలో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని జీఈసీఓ విజయకుమారి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం జిఈసిఓ సందర్శించారు. స్టోర్ రూమ్, వంటగది, భోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అసంపూర్తి పనులు పరిశీలించి సూచనలు చేశారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎస్ ఓ ను ఆదేశించారు.ఈ సందర్భంగా జిఈసిఓ మాట్లాడుతూ.. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బి. శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి



తెలంగాణ వారధి, తొర్రూరు:

సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని లయన్స్ క్లబ్ జిఎల్ టి కోఆర్డినేటర్ డాక్టర్ వేలూరు శారద అన్నారు. సేవా తరుణి అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ వజినపల్లి దీప,అనిల్ కుమార్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా దంపతుల సహకారంతో డివిజన్ కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, స్కేలు పంపిణీ చేశారు.కస్తూర్బా పాఠశాలలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన పొందుతున్న ఆరుగురు విద్యార్థినీలకు రూ. 6 వేల విలువగల పట్టు చీరలను పంపిణీ చేశారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి తో కలిసి అన్న ప్రసాద వితరణ చేపట్టారు.లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థినీల ఆరోగ్య పరీక్షల కోసం రూ.5 వేల విలువగల పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ.. సేవా తరుణి ఆధ్వర్యంలో అద్భుతమైన సేవలను అధ్యక్షురాలు తుమ్మూరు శ్రీదేవిరెడ్డి నేతృత్వంలో కార్యవర్గ ప్రతినిధులంతా నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సేవాతరుని ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని, దానికి స్థానికులు చేయూతనందిస్తున్నారని తెలిపారు. ప్రజా సేవ చేసే వారికి స్థానికులు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ దామెర సరేష్, క్యాబినెట్ నెంబర్ డాక్టర్ నాగవాణి, కోశాధికారి వేముల మంజుల, ప్రతినిధులు తల్లాడ హీరదర్, బిజ్జాల సోమయ్య,రేవూరి శ్రీనివాస్, ధరావత్ విమల,రేణుక దేవి,చలువాది సత్యనారాయణ,అనుపమ వంశీ ఉమారెడ్డి,వినయ్, మౌనిక, శ్రీదేవి పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా

- ప్రజాసేవ కోసం అంగన్వాడీ ఉద్యోగం వదిలిన సర్పంచ్ అభ్యర్థి

తెలంగాణ వారధి, మహబూబాబాద్ రూరల్:



మహబూబాబాద్ మండలం సోమ్లాతండా గ్రామపంచాయతీకి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న భూక్యా కౌసల్య అంగన్వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. భూక్యా మురళీనాయక్ సోదరుడు దళ్సింగ్ సతీమణి కౌసల్య, గత 37 సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్‌గా సేవలందిస్తూ ఉద్యోగం వదిలారు. లక్ష్మతండా గ్రామపంచాయతీకి కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్ పోటీ చేసే బోడ నీల కూడా తన అంగన్వాడీ ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. పార్వతీగిరి గ్రామం నుంచి ఈ ఇద్దరు మహిళలు అంగన్వాడీ ఉద్యోగాలను వదిలి ప్రజాసేవ కోసం ఎన్నికల్లో పాల్గొనడం స్థానికులలో చక్కటి అభిప్రాయాన్ని రేకెత్తిస్తోంది. ప్రజలు ఈ వీరిద్దరిని గెలిపించి అధిష్టానానికి పంపాలని కోరుతున్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

- మహిళ అక్కడికక్కడే మృతి
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**తెలంగాణ వారధి,జయశంకర్ భూపాలపల్లి :** కంకర లోడ్ తో అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుడెప్పాడ్ కు చెందిన గంప సమ్మక్క తన మనవరాలను చూసేందుకు ఈ నెల 26న గుడాడ్ పల్లి గ్రామానికి వచ్చి శనివారం తన ఇంటికి వెళ్లడానికి ఆమె మనవడు సంతోష్ తో టీవీఎస్ ఎక్సెల్ అనే ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి వైపు వస్తుండగా కొంపెల్లి వైపు ఎదురుగా వస్తున్న కంకర లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పైనుండి సమ్మక్క కిందపడగా ఆమె తలపై నుండి లారీ దూసుకెళ్లడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టడం జరిగిందని, భూపాలపల్లి రూరల్ పరిధిలోని కొంపల్లి గ్రామం సమీపంలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటనపై మృతురాలు కుమారుడు గంప శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు భూపాలపల్లి నరేష్ కుమార్ తెలిపారు.

## సర్పంచ్ ఎన్నికల్లో పోటీ

- ఎస్సై ఉద్యోగానికి రాజీనామా



**తెలంగాణ వారధి,సూర్యాపేట :** కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన ఎస్సై పులి వెంకటేశ్వర్లు, స్వచ్ఛందంగా పదవి విరమణ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి, పుట్టిన ఊరికి సేవ చేయడమే ఆయన లక్ష్యం. ఏకంగా 5 నెలల సర్వీస్ మిగిలి ఉన్నప్పటికీ, వృత్తి విరమణ చేసి గ్రామ ప్రజలకు అంకితభావంతో సేవ చేసే తపన చూపించారు. వెంకటేశ్వర్లు ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం అభ్యర్థిగా సిద్ధమయ్యారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన లక్ష్మణ్ తండా గ్రామస్తులు





**తెలంగాణ వారధి,దేవరుప్పుల :** స్థానిక ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం లక్ష్మణ్ తండా గ్రామానికి చెందిన 15 మంది బిఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

## భట్టి విక్రమార్కను కలిసిన లకావత్ ధనవంతి


మొదటిపేజీ తరువాయి

నాయక్ దంపతులు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. భట్టి విక్రమార్క ఈ సమావేశంలో పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరినీ కలిపి అత్యధిక స్థానాలు గెలిచేలా పాటుపడాలని సూచించారు.





# ఘనంగా 'దీక్షా దివాస్'



- **ఉద్యమకారులను ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**

తెలంగాణ వారధి, పాలకుర్తి:

పాలకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్ష రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై ఉద్యమకారులను సన్మానించారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు.


**ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యలు**

"కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం అయిందని,"కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష. అని "కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోపాటు అభివృద్ధి బాటలో ముందుకు దూసుకెళ్లిందని,రైతుల కోసం రైతు బంధు, రైతు భీమా, విద్యార్థుల కోసం వసతి గృహాలు, ఆడపడుచుల కోసం కళ్యాణలక్ష్మి—అల్ అర్ కెసిఆర్'స్ విసన్." "కేసీఆర్ పథకాలతోనే వృద్ధులకు పెన్షన్లు, ప్రజలకు 24 గంటల కరెంట్, సాగు-త్రాగునీటి సమస్యలు పరిష్కరించబడ్డాయని అన్ని వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ నిబద్ధంగా పనిచేశారని "తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు కేసీఆర్."అని అన్నారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండలంలోని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కీలక కార్యకర్తలు, యువజన నాయకులు, సోషల్ మీడియా టీమ్ భారీగా పాల్గొన్నారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.

# పల్లెల్లో ఎన్నికల జోష్

- **సర్పంచ్‌కి 30 గుర్తులు**
- **వార్డు సభ్యులకు 20 గుర్తులు**

తెలంగాణ వారధి:



తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు గులాబీ రంగు కాగితంపై ముద్రించి, వార్డు సభ్యుల గుర్తులను తెలుపు రంగు కాగితంపై ముద్రిస్తారు. ఈ గుర్తులు ప్రజలకు తెలిసిన సాదారణ వస్తువులు, అరికెలు, రసాయనాలు, పరికరాల పేర్లుగా ఉన్నాయి.

*గుర్తులు* : *సర్పంచ్‌కు ముఖ్య గుర్తులు:* చెప్పులు, చెత్తడబ్బా, బిస్కెట్, బ్రష్, ఉంగరం, కత్తెర, బ్యాట్, టూత్ పేస్ట్, స్పానర్ (పానా), ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, బ్యాటరీ లైట్, మనిషి, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టేబుల్, వేరే మరిన్ని ఇందులో ఉన్నాయి.

**వార్డు సభ్యులకు కేటాయించే గుర్తులు :** గౌను, కటింగ్ ప్లేయర్, గ్యాస్ పొయ్యి, స్టూల్, బీరువా, డిష్ యాంటీనా, ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, హాకీ కర్రబంతి, నెక్ టై, కెటిల్, ఓటర్లకు తెలిసిన సాధారణ వస్తువులు.ఎన్నికల ప్రక్రియ మూడు విడతలుగా జరుగుతుంది,

**ఓటర్లకు పంచాయతీ ఎన్నికల్లో నోటా:** (నో ఓట్ అండ్ సర్కంఛన్స్ ఆథార్టీ) అవకాశమూ ఇవ్వబడింది, ఈ అవకాశం శాసనసభ, లోక్‌సభ ఎన్నికల నోటా బటన్ లాంటిదే.ఇవన్నీ రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీ రాజ్ శాఖ నుండి సమీక్షించి, ఎన్నికల సౌకర్యాల కోసం Tepoll అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా ఓటర్ స్లిప్‌లు కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల పిటిషన్ల కోసం ప్రత్యేక న్యాయ విభాగం కూడా ఏర్పాటైంది.ఇవి పల్లెల్లో సందడి కోసం, అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ మొదలు అయ్యింది, మరోరోజు మాత్రమే నామినేషన్ దాఖలుకు అవకాశం ఉంది.

## బదిలీపై వెళ్తున్న ఎస్పీకు ఘన సన్మానం

**తెలంగాణ వారధి,, బాసర :** నిర్మల్ జిల్లా బాసర పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి అమ్మవారి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారిని అంజన్న దేవితో పాటు ఆలయ వేద పండితులు సిబ్బంది శుక్రవారం బైంసాలు విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్తున్నఏ ఎస్పీ అవినాష్‌కుమార్, కు అమ్మవారు చిత్రపటంతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు బాసర అమ్మవారిని దర్శించుకున్న ఏ ఎస్ పి అవినాష్ కుమార్ ను బాసర ఆలయ అధికారులు మాహా మంగళహారతి అందించి తీర్థ లడ్డు ప్రసాదాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ సిఐ మల్లేష్, బాసర ఎస్ హెచ్ ఓ టి సాయికుమార్, పోలీసు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



## పోలీసుల సేవాలను గుర్తించడం ప్రశంసనీయం : జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**తెలంగాణ వారధి,మెదక్ ప్రతినిధి** : మెదక్ టౌన్ లో పెళ్లి రోజు జరిగిన 10 తులాల బంగారం దొంగతనం కేసును మెదక్ టౌన్ పోలీసులు వేగంగా ఛేదించారు. పెళ్లి కూతురిని పెళ్లికి రెడీ చేస్తున్న సమయంలో గదిలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు దొంగతనానికి గురవ్వడంతో బాధిత కుటుంబం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ఈ మేరకు మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ కేసు నమోదు చేసి, విషయాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ నివేదించారు. వెంటనే స్పందించిన ఎస్పీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యేక బృందాలు 2 రోజుల పాటు ఘటనకు సంబంధించిన ప్రతి అనుమానితుడిని విచారణ చేసి, సాంకేతిక ఆధారాలు సహాయంతో నిందితురాలిని గుర్తించి అరెస్టు చేశారు. దర్యాప్తు ప్రక్రియలో స్వాధీనం చేసిన మొత్తం 10 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు బాధిత కుటుంబానికి కోర్ట్ ద్వారా తిరిగి అందజేశారు. విలువైన ఆభరణాలను వేగంగా రికవరీ చేసి అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇలాంటి కేసులను వేగంగా ఛేదించి బాధితులకు న్యాయం చేయడం మా డ్యూటీ అని, మీరు పోలీస్ సేవాలను గుర్తించి అభినందించడం ప్రశంసనియం అని, ఈ సందర్భంగా కేసును వేగంగా చెదించడంలో కృషి చేసిన మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, వారి సిబ్బందిని అభినందించారు.

## హెల్ప్ డెస్క్ ద్వారానే ఫిర్యాదుల స్వీకరణ

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**



**తెలంగాణ వారధి,ప్రతినిధి :** మెదక్ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికలు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటించారు. ఈ కాలంలో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా కార్యాలయానికి రాకుండా, జిల్లా పరిపాలన ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే సమర్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ తాత్కాలిక మార్పును గమనించి సహకరించాలని కోరుతూ, అందిన ప్రతీ ఫిర్యాదును బాధ్యతగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజా సేవల అందుబాటు నిరాటంకంగా కొనసాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ముగింపు అనంతరం ప్రజావాణి కార్యక్రమం మళ్లీ పునఃప్రారంభం కానుందని తెలిపారు.

# బాసర త్రిబుల్ ఐటీ త్రిబుల్ ఐటీలో క్రికెట్ పోటీలు

**తెలంగాణ వారధి, బాసర :**



తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం బాసర త్రిబుల్ ఐటీ లో ఘనంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆర్జీయూకేటీ సర్వోద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ లో రైజింగ్ స్టార్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆర్జీయూకేటీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో రైజింగ్ స్టార్స్ జట్టు రాయల్ గ్లాడియేటర్స్ జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన రైజింగ్ స్టార్స్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకొని దూకుడైన ఆరంభాన్ని ఇచ్చింది 14 ఓవర్లు ముగిసేసరికి 147/4 తో భారీ స్కోరును నమోదు చేసింది. నూట నలభై ఎనిమిది పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ గ్లాడియేటర్స్ జట్టుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కొంత ప్రతిఘటన చూపినప్పటికీ వెంట వెంటనే వికెట్లు కోల్పోవడంతో 13.2 ఓవర్లలో 93 పరుగులకే ఆల్ అవుట్ అయింది. దీంతో రైజింగ్ స్టార్స్ జట్టు 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రీడలు ప్రోత్సహించిన త్రిబుల్ ఐటీ వి.సి. ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, జట్టు క్రీడల వల్ల సభ్యుల మధ్య సమన్వయం, సహకారం వృద్ధి చెందుతాయి అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా రైజింగ్ స్టార్స్ కెప్టెన్ మహమ్మద్ ఆరిఫ్ అలీ కప్పును అందుకున్నాడు.



# బుజ్జితల్లి.. ఈ ఏడాది ఒక్కటి కూడా లేదుగా..!

అందాల భామ సాయి పల్లవి టాలీవుడ్‌లో తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. ఈ స్టార్ బ్యూటీతో సినిమా చేయాలని ప్రతి హీరో, దర్శకుడు ఆశిస్తుంటారు. అయితే, సాయి పల్లవి మాత్రం చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తుంది. ఆమె నటించిన లాస్ట్ చిత్రం 'తండేల్' పూర్తి రొమాంటిక్ డ్రామాగా ఫిబ్రవరిలో రిలీజ్ అయి బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది. అయితే, తండేల్ చిత్రం వాస్తవానికి 2024లోనే పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్యం కారణంగా ఈ చిత్రాన్ని 2025 జనవరిలో రిలీజ్ చేసేందుకు ప్రయత్నించి, చివరికి ఫిబ్రవరిలో రిలీజ్ చేశారు. కాగా, 2025లో సాయి పల్లవి ఒక్కటంటే ఒక్క తెలుగు చిత్రాన్ని కూడా ఓకే చేయలేదు. ఆమె చాలా కథలు విన్నా స్క్రిప్టు నచ్చకపోవడంతో ఆమె రిజెక్ట్ చేస్తూ వస్తోంది. ఇక బాలీవుడ్‌లో ప్రెస్టీజియస్ 'రామాయణం' చిత్రంలో సీతగా నటిస్తోంది.



## భారీ సెట్ లో 'పెద్ది' గాడి ఫైట్..

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ చిత్రం "పెద్ది" కోసం అందరికీ తెలిసిందే. భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా నుంచి వచ్చిన మొదటి సాంగ్ ఆల్రెడీ మ్యూజిక్ ఛార్ట్స్ ను రూల్ చేస్తుంది. ఇక ఈ సినిమా ఇప్పుడు భారీ సెట్ లో ఫైట్ సీక్వెన్స్ కోసం సిద్ధం అయ్యినట్టు తెలుస్తుంది. మేకర్స్ ఓ గ్రాండ్ సెట్ ని వేయగా అందులో రామ్ చరణ్ పై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ ని తెరకెక్కిస్తున్నారట. మరి ఈ ఎపిసోడ్ ని బాలీవుడ్ స్టంట్ మాస్టర్ షామ్ కౌశల్ (దంగల్ ఫేమ్) సారథ్యంలో తెరకెక్కిస్తుండగా ఈ ఫైట్ లో ఓ సర్ప్రైజ్ కూడా ఉందట.



## ధనుష్ కొత్త సినిమాకు పాజిటివ్ టాక్..

కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే' సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం హిందీతో పాటు తమిళంలో పాజిటివ్ టాక్ సాధించడంతో పాటు మొదటిరోజే దాదాపు రూ.16 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో ధనుష్ బాలీవుడ్ కెరీర్‌లోనే ఇది అతిపెద్ద ఓపెనింగ్ కావడం విశేషం. మరోవైపు ఈ ఏడాది విడుదలైన చిత్రాలలో సైయారా తర్వాత రెండో అతిపెద్ద ఓపెనింగ్‌ను నమోదు చేసిన చిత్రంగా 'తేరే ఇష్క్ మే' రికార్డు నెలకొల్పింది. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా' 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.



## బెల్లా బెల్లా.. రసగుల్లా.. రవితేజ కొత్త పాట ప్రోమో

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'బెల్లా బెల్లా' అంటూ లిరికల్ సాంగ్ ను త్వరలో విడుదల చేయనున్నారు. శనివారం దీనికి సంబంధించిన ప్రోమోను చిత్ర బృందం పంచుకుంది. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చారు. నకాష్ అజీజ్, రోహిణి సొర్రాట్ ఈ పాటను ఆలపించారు.

## ప్రభాస్ 'స్పిరిట్'లో కాజోల్ దేవగణ్.?

పాన్ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హైవోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు.

